క్లుప్తంగా

అన్నదాతలకు అండగా నిలవాలి



ఉయ్యూరు: అన్నదాతలకు అండగా నిలవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని లయన్స్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మండలంలోని కడవకొల్లులోని వడ్డె బసవరాజ్యం కమ్యూనిటీ హాలులో శుక్రవారం రైతుసదస్సు నిర్వహించారు. కడవకొల్లు సర్పంచ్ మంగినేని సుధారాణి, కుందేరు సర్పంచ్ కలకోట రాధికారెడ్డిలకు దోమల నివారణ మందులు అందించారు. గద్దె శేషగిరి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా గ్రామీణులకు సేవలు అందించాలన్నారు. రైతులకు తోడ్పాటుగా ఉంటూ మేలు చేసే కార్యక్రమాలు చేయాలన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని రైతాంగం లాభాలు ఆర్జించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు నూకల వెంకట సాంబశివరావు, ఎండీ ఇస్మాయిల్, నల్లా శ్రీనివాస్, డాక్టర్ రావులపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



పెనమలూరు: యనమలకుదురులో ప్రభుత్వ స్థలం ఆక్రమణలపై అధికారులు సర్వే చేసి తొలగింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామివారి ఆలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వ్యక్తి 20 సెంట్ల మేర ఆక్రమించారు. ఇందులో గాజుల దిబ్బ స్థలం కూడా ఆక్రమణలో ఆరు సెంట్లు ఉందని గుర్తించారు. ఆక్రమణదారు అత్యంత విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మించారు. దీనిపై స్థానికులు కమిషనర్ ఎస్.ప్రకాశరావుకు ఫిర్యాదు చేయటంతో శుక్రవారం మండల సర్వేయర్‌తో సర్వే చేయించారు. స్థలం ఆక్రమణలో ఉందని తేలటంతో తొలగింపునకు రంగం సిద్ధం చేశారు. ఆక్రమణ దారుడు తనకు తానుగా ఆక్రమణలు తొలగించని పక్షంలో తామే ఆక్రమణలు తొలగిస్తామని అధికారులు తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఉంగుటూరు: స్వచ్ఛంద సంస్థల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీవో శేషగిరి రావు ఆకాంక్షించారు. వెల్దిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 66 సైకిళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. విన్సెంట్ ఫెర్రర్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా రూ.4.50 లక్షల విలువైన 66 సైకిళ్లు ట్రస్ట్ ఏరియా మేనేజర్ రామంజనేయులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ-2 చంద్రశేఖర్, ఎంఈవో వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ప్రసాద్, ఉంగుటూరు కెనరా బ్యాంక్ మేనేజర్ భార్గవి, ఎస్ఎస్ ఏఈ గంగరాజు, కార్యదర్శి సత్యసాయిబాబు పాల్గొన్నారు.

తాడిగడప ప్రత్యేకాధికారిగా విజయ్‌కుమార్ బాధ్యతలు



పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ ప్రత్యేకాధికారిగా ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాడిగడప మునిసిపాలిటీ ప్రత్యేకాధికారిగా గుడివాడ ఆర్డీఓగా పద్మావతి విధులు నిర్వర్తించారు. ఇప్పుడు ఆమె స్థానంలో ఉయ్యూరు ఆర్డీఓ విజయకుమార్ విధుల్లో చేరారు. ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్‌కు కమిషనర్ ఎస్.ప్రకాశరావు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు.

బందరు సర్వజన ఆస్పత్రిలో థైరాయిడ్ టెస్ట్‌లకు అవకాశం

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఇకపై థైరాయిడ్ టెస్ట్‌ను ఉచితంగా చేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. థైరాయిడ్ వ్యాధితో బాధపడుతున్న వారు సంబంధిత ఓపీ విభాగానికి వెళ్లి వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు థైరాయిడ్ టెస్ట్ చేయించుకోవచ్చునన్నారు. దీనిని మచిలీపట్నం పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్‌కు పక్కా ఏర్పాట్లు



నున్న పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బంది సమావేశం



గండిగుంట పోలింగ్ కేంద్రానికి పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడు పట్టణంలోని 9వ వార్డు పోలింగ్ ప్రక్రియ ఈనెల 19న జరగనుంది. 9వ వార్డు సభ్యుడు తన పదవికి రాజీనామా చేయటంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఉప ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 14తో ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో వైఎస్సార్‌సీపీ మద్దతుగా మలబంటి దుర్గాప్రసాద్ అలియాస్ చిన్నమ్ములు, టీడీపీ మద్దతుతో చలవాది రాజా, జనసేన, బీజేపీ సంయుక్త అభ్యర్థిగా పి.ప్రవీణ్‌కుమార్ బరిలో నిలిచారు. వార్డులో ఎవరికి వారు తమదైన శైలిలో విస్తృతంగా ప్రచార పర్వాన్ని పూర్తి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు.

144 సెక్షన్..

శనివారం నిర్వహించనున్న పోలింగ్ ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచే పట్టణంలోని పోలింగ్ కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులోకి తెచ్చారు. పోలింగ్ నిర్వహణకు పట్టణంలోని ఎంపీపీ పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేశారు. 725 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు అనంతరం విజేత ప్రకటన చేసేందుకు ఏర్పాట్లు చేశామని ఇన్‌చార్జి ఎంపీడీఓ టీ.ఉదయబాస్కర్ తెలిపారు.



పోలింగ్‌కు సిద్ధం చేసిన కంకిపాడు ఎంపీపీ పాఠశాల తరగతి గదులు


నేడు నున్న గ్రామ 9వ వార్డు ఉప ఎన్నిక

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ 9వ వార్డు ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో బీఎల్‌వీ శేషగిరిరావు తెలిపారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ.. శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, 2.30 గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సిబ్బందిని నియమించామని చెప్పారు. పోలింగ్ కేంద్రం పరిధిలో 144వ సెక్షన్ విధించామని, ప్రజలు పోలింగ్ కేంద్రం పరిధిలో గుంపులు గుంపులుగా ప్రజలు ఉండరాదన్నారు. 9వ వార్డు ఉప ఎన్నికకు ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. 827 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఇన్‌చార్జి ఎంపీడీవో చెప్పారు.

గండిగుంటలో వార్డు ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

ఉయ్యూరు: మండలంలోని గండిగుంట పదో వార్డు ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎంపీపీ పాఠశాలలో శనివారం పోలింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఎంపీడీఓ విమాదేవి పర్యవేక్షణలో ఎన్నికల అధికారి వి.రఘునాథ్, సిబ్బంది పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. వార్డులో మొత్తం 394 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో మోర్ల యోగేశ్వరరావు, టీడీపీ బలపర్చిన వీరంకి పాండురంగారావు బరిలో నిలిచారు.

ఆలయాల్లో శ్రావణ సందడి



ఉయ్యూరు శివాలయంలో..



పేరంటాలమ్మ దర్శనార్థం బారులుతీరిన భక్తులు



ప్రొద్దుటూరు శివాలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన చేస్తున్న భక్తులు



సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

ఉయ్యూరు: శ్రావణమాసం మొదలైంది. ఆలయాలు శ్రావణశోభను సంతరించుకున్నాయి. తొలి శుక్రవారం కావటంతో మహిళలు విశేషంగా శ్రావణ పూజలు జరిపించారు. ఉయ్యూరు శివాలయంలో వేంచేసిన జగదాంబ దేవి అమ్మవారికి గాజులతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజించి తరించారు. శ్రీ విజయ దుర్గాదేవి, పెద ఓగిరాల శివాలయం, గండిగుంట దత్తపీఠంలో భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు జరిగాయి.

ప్రత్యేక పూజలు

కంకిపాడు: శ్రావణ మాసం తొలి శుక్రవారం ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు జరిపించారు. ఆలయాలు శ్రావణ మాస శోభతో కళకళలాడాయి. కంకిపాడు, ప్రొద్దుటూరు, ఈడుపుగల్లు, ఉప్పలూరు, మంతెన, నెప్పల్లి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రొద్దుటూరు శివాలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన జరిపించారు. భక్తులు కుంకుమ పూజలో అధిక సంఖ్యలో పాల్గొని కాశీ అన్నపూర్ణా దేవిని పూజించి తరించారు. అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు గూడూరు శ్రీనివాసప్రసాద శర్మ, మహిధర్ పర్యవేక్షించారు.

పేరంటాలమ్మ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం కావటంతో భక్తులతో ఆలయం కిక్కిరిసింది. గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళలు, విద్యార్థినులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు

గన్నవరంలో పూజలు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మి)కు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గ్రామ పొంగళ్లను భక్తులు సమర్పించారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ ఆలయ కమిటీ, శ్రీసత్యసాయి సేవా సమితి మందిర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావును ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు, పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

గోదాదేవికి విశేష పూజలు

దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో తిరు నక్షత్రం సందర్భంగా శ్రీగోదాదేవి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. తొలుత పంచామృతాలతో అభిషేకం, సువాసినులచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయానికి అందరి కృషి అవసరం



పోరంకిలో సచివాలయ కన్వీనర్లను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణుల పాత్ర చాలా కీలకమని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేసి ఎన్నికల్లో పార్టీ విజయం సాధించే విధంగా శ్రమించాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. పోరంకి ఎల్ఎస్ గార్డెన్స్‌లో శుక్రవారం పెనమలూరు నియోజకవర్గ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, మండల సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రానున్న ఎన్నికలు చాలా కీలకమన్నారు. ఎన్నికల్లో విజయం సాధించటానికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పూర్తి స్థాయిలో పని చేయాలని సూచించారు. పార్టీ పరిశీలకుడు బొప్పన భవకుమార్, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, కంకిపాడు జెడ్పీటీసీ బాకీబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ నినావత్ చిన్ని, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, రాజులపాటి రామచంద్రరావు, చాన్‌బాషా, బిందుమాధవి, రామినేని రమాదేవి, నక్కా శ్రీనివాస్, సోలె సురేష్, దాసే రవి, వేమూరి బాలకృష్ణ, చిరంజీవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు పోరంకి సెక్షన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పోరంకి ప్రాంతంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా పెనమలూరు సెంటర్, పోరంకి బాలాజీనగర్, సాలిపేట, పాత పోలీస్‌స్టేషన్ ప్రాంతం, ఏవీఎం గార్డెన్స్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

గన్నవరంలో..

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాస హెచ్‌టీఎస్ ఫీడర్‌లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ పి.హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్‌లోని దావాజిగూడెం, అల్లాపురం, పామర్తినగర్ సెంటర్, పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు, రైస్‌మిల్ బజారు, రాజీవ్‌నగర్ కాలనీ, ఎస్టీబీఎల్ కాలనీ, మల్లికార్జున స్కూల్ రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

రేపు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్యశిబిరం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 20వ తేదీన విజయవాడ, ఆయుష్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం, ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేయనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరాన్ని ఉదయం 9 గంటలకు మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారన్నారు. గుండె, ఎముకలు, కీళ్ల నొప్పులు, ఊపిరితిత్తులు, మెదడు, నరాలు, సాధారణ జబ్బులకు పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆత్కూరు పరిసర ప్రాంతాల వారు సద్వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్‌తో పాటు నగదు పురస్కారం వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందజేస్తామన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు 2000-02 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.రజనికుమారికి కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. తమ ఉన్నతికి బాటలు వేసిన పాఠశాలను, ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువరాదని పూర్వ విద్యార్థులు నిరూపించారని తెలిపారు. తొలుత జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకుని సందడి చేశారు. పాఠశాల రోజులను గుర్తుచేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంకు కంప్యూటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గ్రామాల అభివృద్ధికి మండల పరిషత్ సహకారం

గన్నవరం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మండల పరిషత్ ద్వారా పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ఎంపీపీ అనగాని రవి తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ప్రభుత్వ శాఖల వారీగా సమీక్ష జరిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధితో పాటు జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలంలో రెండో విడతలో మరో 3,500 మందికి ఇళ్ల స్థలాల పంపిణీకి సన్నహాలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్న గ్రామాల్లో రెండు, మూడు నెలల్లో నివేశన స్థలాల పంపిణీకి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చర్యలు తీసుకుంటారన్నారు. మిగిలిన గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు భూసమీకరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, వైస్ ఎంపీపీలు కొమ్మురాజు సుధీర్, కాలగడ్డ శివనాగరాజకుమారి, ఎంపీడీవో సత్యకుమార్, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవి

29న అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ స్టాండ్ నుంచి ఈ నెల 29వ తేదీన అరుణాచలం గిరిప్రదక్షిణ యాత్ర నిమిత్తం ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు గన్నవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శివాజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు హనుమాన్‌జంక్షన్‌లో ఆర్టీసీ బస్సు బయలుదేరి 30వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి చేరుకుంటుందని చెప్పారు. అక్కడ మధ్యాహ్న భోజనం తర్వాత బయలుదేరి సాయంత్రం శ్రీపురం గోల్డెన్ టెంపుల్, రాత్రికి అరుణాచలంలో బస చేస్తారన్నారు. 31వ తేదీ పౌర్ణమి రోజున ఉదయం అరుణాచలం గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం మధ్యాహ్నం కంచి కామాక్షి అమ్మవారి దేవస్థానానికి చేరుకుంటారన్నారు. అదేరోజు రాత్రి తిరిగి హనుమాన్‌జంక్షన్‌కు బయలు దేరనున్నట్లు చెప్పారు. ఈ యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర రూ.3100గా నిర్ణయించామని డీఎం శివాజీ తెలిపారు. హనుమాన్‌జంక్షన్ ప్రాంత భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

గుడివాడరూరల్: విద్యార్థులు జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫణి అన్నారు. స్థానిక కేటీఆర్ మహిళా కళాశాలలో కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భవిష్యత్‌పై దిశా నిర్దేశాలను నిర్ణయించుకుని ముందుకు సాగాలన్నారు. జీవితంలో చేయాల్సిన పనులను ముందుగానే అనుకుని వాటిపై శ్రద్ధ చూపి విజయవంతం కావాలన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ వి.సుజాత పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

గన్నవరంరూరల్: పాడి రైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని చైర్మన్ చలసాని ఆంజనేయులు చెప్పారు. ముస్తాబాద మినీ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన దిముస్తాబాద పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం బోనస్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. లక్షలాది రైతు కుటుంబాల సంస్థగా యూనియన్ సేవలందిస్తుందని చెప్పారు. యూనియన్ ఆధ్వర్యంలో క్షీరబంధు, కల్యాణమస్తు, బీమా సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. నాణ్యమైన సెమన్‌ను పంపిణీ చేస్తున్నామని, ఈ సేవలన్ని పాలకేంద్రాల వద్ద ప్రదర్శించి పాడి రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ముస్తాబాద పాలకేంద్రం ద్వారా 123 మంది ఉత్పత్తిదారులకు రూ.2 లక్షలు బోనస్‌ను పంపిణీ చేశారు. ప్రతి నాలుగు నెలలకు క్రమం తప్పకుండా బోనస్ అందిస్తున్న యూనియన్ పాడి రైతులదని చెప్పారు. ముస్తాబాద పాలకేంద్రం అధ్యక్షుడు కడియాల గోపాలరావు(కోటయ్య) కృషితో ఈ కేంద్రం గడిచిన కొన్నేళ్లుగా ప్రగతి సాధించటంతో పాటు విశేష అభివృద్ధి సొంతం చేసుకుందని ఆయనను సత్కరించారు. జిల్లా డైరెక్టర్లు దాసరి వెంకటబాలవర్ధనరావు, పాలడుగు నాని, పలగాని కొండలరావు, జీఎం అనిల్‌కుమార్, రూట్ మేనేజర్ కోటా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమమే ధ్యేయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ పని చేస్తోందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని కాకాని వెంకటరత్నం పాల ఉత్పత్తిదారుల భవనంలో శుక్రవారం బోనస్ పంపిణీ చేశారు. గత నాలుగు నెలలకు గానూ హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని పాడి రైతులకు రూ.1.85 కోట్లు బోనస్ రూపేణా అందించారు. చలసాని మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా నిరంతరం పాడి రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. రైతాంగాన్ని పాడి పరిశ్రమ వైపు ప్రోత్సహించేందుకు పలు జాతీయ బ్యాంకులతో ఎంవోయూ కుదుర్చుకుని రుణాల మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయంతో పాటుగా పాడి పశువుల పెంపకం ద్వారా రైతులకు అదనపు రాబడి సాధించవచ్చని చలసాని చెప్పారు. కృష్ణామిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, జీఎం అనిల్‌కుమార్, ట్రస్ట్ డైరెక్టర్ పిన్నమనేని లక్ష్మీ ప్రసాద్, హనుమాన్‌జంక్షన్ పాలశీతల కేంద్రం మేనేజర్ కిలారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



బోనస్ అందజేస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

ఉంగుటూరు: స్వాతంత్ర్య సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహింసావాదం మాత్రమే స్వాతంత్ర్య సాధనకు సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని బోస్ బలంగా నమ్మారన్నారు. మీరు నాకు రక్తం ఇస్తే నేను మీకు స్వేచ్ఛ ఇస్తాను అనే నినాదంతో స్వాతంత్ర్య పోరాటంలో తనకంటూ ఓ ప్రత్యేకతను సాధించుకున్నారని పేర్కొన్నారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఉంగుటూరులో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు తదితరులు

ఏటీఎల్ఎస్‌తో ప్రాణాలను రక్షించవచ్చు



సదస్సు ప్రారంభిస్తున్న డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు

గన్నవరంరూరల్: అడ్వాన్స్‌డ్ ట్రామా లైఫ్ సపోర్టు(ఏటీఎల్ఎస్) ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వర రావు తెలిపారు. కళాశాలలో అడ్వాన్స్‌డ్ ట్రామా లైఫ్ సపోర్టుపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఏటీఎల్ఎస్‌లో శిక్షణ ద్వారా ఎన్నో ప్రాణాలను రక్షించవచ్చన్నారు. ఈ మహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్న పిన్నమనేని సిద్ధార్థ యాజమాన్యం కృషి అభినందనీయమని లక్నో కింగ్ జార్జీ మెడికల్ యూనివర్సిటీ కోర్సు డైరెక్టర్ డాక్టర్ వినోద్ జైన్ చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు.